జీహెచ్‌ఎంసీ సీల్ తొలగించిన ఇద్దరిపై కేసు



సీల్ చేసిన భవనం

అల్లాపూర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పరిమిత అంతస్తులకు మించి నిర్మాణాలు చేపట్టారని, సీల్ చేసిన భవనం సీళ్లు తొలగించారంటూ ఇద్దరు వ్యక్తుల మీద క్రిమినల్ కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే.. అల్లాపూర్ డివిజన్ పరిధిలోని గాయత్రి నగర్‌లో ప్లాట్ నెం.371 ఇంటి యజమాని స్టిల్ట్ మరియు మూడు అంతస్తులకు పర్మిషన్ తీసుకుని పరిమితికి మించి అదనంగా నాల్గవ, ఐదవ అంతస్తులను అక్రమంగా నిర్మించారు. ఇందుకుగాను గత నవంబరులో టీజీబీపాస్ యాక్ట్ 2020 ప్రకారం నిర్మాణదారులపై కేసు నమోదు చేసుకుని షోకాజ్ నోటీసులు ఇచ్చారు. తదనంతరం గత డిసెంబరులో అక్రమ అంతస్తులు తొలగించాలంటూ జీహెచ్‌ఎంసీ అధికారులు స్పీకింగ్ ఆర్డర్ జారీ చేశారు. ఇంత జరిగినా నిర్మాణదారు, యజమాని ఉత్తర్వులను పాటించకపోవటం, అధికారులు వేసిన సీల్ తొలగించటం, సీల్ చేసిన ప్రాంతంలోకి ట్రెస్‌పాస్ చేయటం, అందులో రాత్రిళ్లు నిర్మాణ పనులు చేపట్టినందుకుగాను జి.మణెమ్మ, జి.ఉమామహేశ్వర్ అనే ఇద్దరు వ్యక్తులపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. జీహెచ్‌ఎంసీ నియమాలు ఉల్లంఘించారంటూ మూసాపేట్ ఉప కమిషనర్ వంశీకృష్ణ మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు అల్లాపూర్ పోలీసులు బీఎన్‌ఎస్ సెక్షన్ 223, 334(2) ప్రకారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



బండరాయి తొలగింపు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సబీహ బేగం

రాజీవ్‌గాంధీ నగర్‌లో సీసీ రోడ్ల పరిశీలన

అల్లాపూర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ డివిజన్ పరిధిలోని రాజీవ్ గాంధీ నగర్‌లో ఇటీవల ప్రారంభించిన సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ సబీహ బేగం బుధవారం పరిశీలించారు. గుట్ట ప్రాంతం అయిన ఈ కాలనీలో పెద్దపెద్ద బండ రాళ్లు ఉండటంతో వాటిని తొలగించే పనుల్లో సిబ్బంది నిమగ్నమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన సబీహ బేగం కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు చొరవతో రాజీవ్ గాంధీ నగర్‌లోని అన్ని వీధుల్లో సీసీ రోడ్డు పనులు పూర్తిచేయిస్తున్నామని, రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణా లు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజీవ్ గాంధీ నగర్ బస్తీ వాసులు పాల్గొన్నారు.



కార్పొరేటర్‌ను సన్మానిస్తున్న విజయనగర్‌కాలనీ వెల్ఫేర్ ప్రతినిధులు

కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్‌కు సన్మానం

హైదర్‌నగర్, ఏప్రిల్23 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ విజయనగర్ కాలనీలో డ్రైనేజీ, సీసీరోడ్లు నిర్మాణ పనులు పూర్తిచేసిన సందర్భంగా కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్‌ను కలిసి శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, కాలనీలో ఎటువంటి సమస్యలున్నా పరిష్కరిస్తామని, డివిజన్ అభివృద్ధి కోసం నిరంతరం అందుబాటులో ఉంటానన్నారు. కార్యక్రమంలో విజయనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సత్యనారాయణ, జనరల్ సెక్రటరీ స్వరూప, ఉపాధ్యక్షుడు మురళీ కృష్ణ మోహన, లింగారెడ్డి, శ్రీధర్, రామకృష్ణ పాల్గొన్నారు.



డివిజన్ నాయకులతో కలిసి పోస్టరును ఆవిష్కరిస్తున్న బీఆర్‌ఎస్ కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్

చలో వరంగల్ పోస్టర్ ఆవిష్కరణ

ఫతేనగర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ డివిజన్ నాయకులకు పిలుపు నిచ్చారు. బుధవారం ఉదయం శోభనా కాలనీలోని పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశమై రజతోత్సవ సభకు వెళ్లే అంశాలపై చర్చించారు. అనంతరం పార్టీ నాయకులతో కలిసి చలో వరంగల్ పోస్టరును కార్పొరేటర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, వరంగల్ సభలో కేసీఆర్ ప్రసంగం వినేందుకు తెలంగాణ ప్రజలంతా ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారని అన్నారు. సభను విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళా నేతలు శిల్పాగౌడ్ భిక్షపతి, సుదర్శన్‌రెడ్డి, కమలమ్మ, బాలమణి, రహిమ, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు

కేపీహెచ్‌బీకాలనీ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు (కిలో, రూపాయల్లో) ఇలా ఉన్నాయి. టమోట 15, వంకాయ 18, బెండకాయ 35, పచ్చి మిర్చి 35, బజ్జి మిర్చి 23, కాకరకాయ 35, బీరకాయ 35, క్యాబేజీ 10, బీన్స్ 65, క్యారెట్ 21, గోబి పువ్వు 18, దొండకాయ 23, చిక్కుడు కాయ 55, గోరు చిక్కుడు 35, బీట్‌రూట్ 15, క్యాప్సికం 50, ఆలుగడ్డ 25, కీర 16, దోసకాయ 18, సొరకాయ 12, పొట్లకాయ 15, కంద 85, ఉల్లిపొరక 28, ఉల్లిగడ్డ 18, మామిడి కాయ 15-20, అరటికాయ 8-9, చామగడ్డ 35, ముల్లంగి 4-5, చిలగడదుంప 30, గుమ్మడికాయ 25, నిమ్మకాయలు 60-70, మునగ కాయలు 5-6, పచ్చిబఠాణి 40, బొప్పాయి 40, పుట్టగొడుగులు 40, ఎండు మిర్చి 160, అల్లం 80, వెల్లుల్లి 160, చింతపండు 160, పండు మిర్చి 80, ఉసిరి 55, కరివేపాకు 70, పర్వల్ రూ.60, పల్లికాయ 50, లోబా 23, ఆ కాకరకాయ 60. పైన పేర్కొన్న ధరలు ఈరోజు ఉదయం 9.30 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.



శాంతి చేకూరాలని..

కేపీహెచ్‌బీ కాలనీ రమ్యగ్రౌండ్ మిత్రబృందం ఆధ్వర్యంలో బుధవారం రాత్రి రమ్యగ్రౌండ్ నుంచి టెంపుల్ బస్టాండ్ వరకు పహల్గామ్‌లో ఉగ్రదాడికి నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో స్వరూపగౌడ్, షేక్‌సత్తార్, రఘురామ్, కట్టా నరసింగరావు, మోర్ల రామకృష్ణ, యంపరాల సాంబశివరావు, నాయారాయణరావు, ఏనుగు వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

- (కేపీహెచ్‌బీ, ఆంధ్రజ్యోతి)

పైసలిస్తేనే రేషన్ కార్డు..!

కేపీహెచ్‌బీలో రేషన్ తీసుకుంటున్న లబ్ధిదారులు



- వేయి రూపాయలిస్తేనే ఒకే చేస్తాం
- కొత్త కార్డుల పేరుతో రేషన్ షాపుల డీలర్ల దోపిడీ

కేపీహెచ్‌బీకాలనీ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : సామాన్యుడి అవసరాన్ని క్యాష్ చేసుకుంటున్నారు. కొత్త రేషన్ కార్డుల పేరుతో రేషన్ షాపుల డీలర్లు దరఖాస్తు దారుల నుంచి ముక్కుపిండి వసూళ్లు చేస్తున్నారు. ఆన్‌లైన్‌లో మీ పేరు వచ్చింది తెలుసా? మీకు సొంత ఇల్లు ఉందనుకుంటా ? మీకు కారు ఉందంట కదా? అని పరోక్షంగా ఫోన్‌లోనే బెదిరించడం కేపీహెచ్‌బీ ప్రాంతంలో పరిపాటిగా మారింది. సర్వేలో ఇప్పుడు రూ.1000 ఇవ్వండి.. కార్డు వచ్చాక మరో రూ.500 ఇవ్వాల్సి ఉంటుందని చెబుతున్నారు. పేరు వచ్చిందో లేదో తెలియదు కానీ ఇప్పుడు అడిగిన డబ్బులు ఇవ్వకపోతే వచ్చిన పేరును డీలర్లు తొలగిస్తారేమోననే భయంతో వారు అడిగినంత క్యాష్ రూపంలో ముట్టజెబుతున్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే అన్ని రకాల సంక్షేమ పథకాలకు రేషన్ కార్డే ప్రామాణికం. బీపీఎల్ (బిలో ప్రావర్టీ లైన్) కుటుంబాలకు రేషన్ కార్డు ఉంటేనే పథకాలకు అర్హులు. ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలన్నా, గృహజ్యోతి పథకం కింద 200 కరెంట్ ఫ్రీ, రూ.500కే గ్యాస్ బండ దీనికి తోడు రాజీవ్ యువ వికాస్ పథకానికి దరఖాస్తు చేసుకోవాలన్నా రేషన్ కార్డు అవసరం. దీంతో ప్రభుత్వ సంక్షేమ, సబ్సిడీలు ఏమి కావాలన్నా కార్డు ప్రధానం కావడంతో నాలుగేళ్లుగా కొత్త రేషన్ కార్డులతో పాటు మార్పు చేర్పుల కోసం జనం వేచి చూస్తున్నారు. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన పేరుతో దరఖాస్తులను 2024 ఫిబ్రవరిలో, 2025లో ఫిబ్రవరిలో ఆహ్వానించింది. దీంతో కూకట్‌పల్లి నియోజకవర్గంలో 10వేలకు పైగా

సంక్షేమ పథకాలకు రేషన్ కార్డే ప్రామాణికం

లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నారు. కానీ ఆన్‌లైన్‌లో తాజాగా పేర్లు వచ్చింది మాత్రం వందల్లోనే. దీంతో రేషన్ షాపుల డీలర్లు కొత్తగా పేర్లు వచ్చిన జాబితాను దగ్గర పెట్టుకొని ఫోన్లు చేస్తున్నారు. కేపీహెచ్‌బీ నాలుగోఫేజ్‌లో ఎక్కువగా పేదలు ఉండటంతో అక్కడున్న రెండు షాపుల్లో ఎవరికి వారు అందిన కాడికి దండుకుంటున్నారు. ఇక కేపీహెచ్‌బీ రోడ్డు నంబర్-3లోని ఓ దుకాణంలో డబ్బులు ఇస్తేనే మీ పేరు ఉంటది లేదంటే మీ ఇష్టం. ఎంక్వైరీకి వస్తే తాము మీకు ఉన్న ఇల్లు, కార్ల గురించి చెప్పాల్సి వస్తుందని బెదిరిస్తున్నట్లు తెలిసింది. తాము అడిగినప్పుడు డబ్బులు ఇస్తే సరి. లేదంటే మీ ఇంటికి ఎంక్వైరీకి ఎవరు వస్తారో తెలుసా సివిల్ సప్లై అధికారుల వెంట మేమే వస్తాం. మీరు పైసలు ఇవ్వకుండా సతాయించారో మేము కూడా మీరు అర్హులో కాదో తేలుస్తాం. ఆ తర్వాత మీరు ఏం చేసినా ప్రయోజనం ఉండదు. అంతా ఒకటే సారి అడగడం లేదు కదా ఇప్పుడు వెయ్యి, కార్డు వచ్చాక మీకు బియ్యం ఇచ్చేటప్పుడు మరో రూ.500 అంతే. ఆలోచిస్తారా ? మేము చెప్పినట్లు డబ్బులు ఇస్తారా ? అంటూ దుకాణాల వద్ద ఓపెన్‌గానే నగదు రూపంలో తీసుకుంటున్నారు. కేపీహెచ్‌బీ, బాలాజీనగర్, మూసాపేట్ ప్రాంతాల్లో ఈ దందా ఎక్కువగా జరుగుతుందని దరఖాస్తుదారులు చెబుతున్నారు. కొత్తగా ఆన్‌లైన్‌లో పేర్లు వచ్చిన జాబితాపై సివిల్ సప్లై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే మాత్రం రేషన్ డీలర్లు అడ్డంగా దొరికిపోతారని చెబుతున్నారు.

భయపడుతూనే..

ఒక్కో దుకాణంలో పదుల సంఖ్యలో ఒక్కో దరఖాస్తు దారుని నుంచి వెయ్యి రూపాయలు వసూళ్లు చేస్తున్నారు. ఇవ్వడానికి జంకుతూనే వచ్చిన కార్డును ఎందుకు పోగొట్టుకోవాలి అనే ఆలోచనతో నమ్మకం లేకపోయినా డబ్బులు ఇచ్చామని చెబుతున్నారు. అయ్యా మాపేరు మా వివరాలు ఏమి బయటకు చెప్పొద్దు.. మేము చెప్పినట్లు బయటకు తెలిసిస్తే కొన్నేళ్లుగా రేషన్ కార్డు కోసం ఎదురుచూస్తున్నాం. వచ్చిన కార్డు మీరే పోగొట్టినవారు అవుతారని వేడుకోవడం గమనార్హం. మీరు ఇచ్చే డబ్బులు మాకు కాదమ్మా.. సార్లు తీసుకోమని చెబితేనే మిమ్మల్ని అడుగుతున్నాం అంటూ డీలర్లు బహిరంగంగానే దరఖాస్తుదారులకు చెబుతుండటం పలు అనుమానాలకు తావిస్తోంది.

డబ్బులడిగితే చర్యలు తీసుకుంటాం

కొత్తగా కూకట్‌పల్లి సర్కిల్‌లో 12వేల మంది సభ్యులకు ఆన్‌లైన్‌లో పేర్లు వచ్చాయి. వచ్చే నెల నుంచి పాత వారితో పాటు కొత్త వారికి బియ్యం ఇచ్చే ఏర్పాట్లు చేస్తున్నాం. అర్హులను ఎంపిక చేసే బాధ్యత తహసీల్దార్ కార్యాలయం నుంచి చూస్తున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఒక్క పైసా లేకుండా ఉచితంగానే రేషన్ కార్డు మంజూరు చేయడం జరుగుతుంది. ఏ రేషన్ షాపు డీలర్ అయినా డబ్బులు అడిగినా, అధికారుల పేరుతో ఫోన్లు చేసినా నేరుగా ఫిరోజిగూడలోని కార్యాలయంలో ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం.

- కల్యాణ్, ఏసీఎస్‌వో, కూకట్‌పల్లి సర్కిల్

కీబోర్డు ప్లేయింగ్‌లో గిన్నిస్ రికార్డ్

కూకట్‌పల్లి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కీ బోర్డు ప్లేయింగ్‌లో గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించిన చిన్నారులు లేషా (8) ప్రజ్ఞ (5)లను కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అభినందించారు. కేపీహెచ్‌పీ కాలనీకి చెందిన చిన్నారులు కీ బోర్డు ప్లేయింగ్‌లో 18 దేశాలకు చెందిన సంగీత కళాకారులతో పాల్గొని అరుదైన గిన్నిస్ వరల్డ్ రికార్డు పొందడంపై ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేశారు. 2024, డిసెంబర్ 1వ తేదీన హోలీ మ్యూజిక్ స్కూల్ విద్యార్థులతో కలసి కీ బోర్డుప్లేలో పాల్గొని ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియో అప్‌లోడ్ చేయగా గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అధినేత మిస్టర్ రిచర్డ్ స్టన్నింగ్ సంగీత కళాకారులను 2024, డిసెంబర్ 9న విజేతలుగా ప్రకటించారు. 2025 ఏప్రిల్ 14న మణికొండలో జరిగిన వేడుకల్లో గిన్నిస్‌బుక్ ఆఫ్ రికార్డ్ ప్రతినిధి ఆనంద్ రాజేంద్రన్ మ్యూజిక్ స్కూల్ వ్యవస్థాపకులు ఆగస్టిన్‌లు చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేసినట్లు చిన్నారుల తల్లి దండ్రులు వివరించారు.



గిన్నిస్ రికార్డ్ సాధించిన చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను ప్రజలకు వివరించండి

కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి నాయకులతో టెలీకాన్ఫరెన్స్‌లో ఎమ్మెల్యే

కూకట్‌పల్లి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 16 నెలలలోనే ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి బీఆర్‌ఎస్ నాయకులకు సూచించారు. బుధవారం రెండు నియోజకవర్గ బీఆర్‌ఎస్ ముఖ్యనేతలతో ఎమ్మెల్యే టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈనెల 27న జరిగే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు వేలాదిగా తరలిరావాలన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తన ప్రాణాలు పణంగా పెట్టి తెలంగాణ రాష్ట్రం సాధించారని, పదేళ్లలో రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపించారన్నారు. ఈనెల 27న జరిగే సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బీఆర్‌ఎస్ నాయకులు చూసుకోవాలని పిలుపునిచ్చారు. రాబోయేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

చలివేంద్రం ప్రారంభం

హైదర్‌నగర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): బీజేపీ నేత బొల్లేపల్లి సీతారామరాజు నిజాంపేట చౌరస్తా బస్టాప్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శేరిలింగంపల్లి బీజేపీ ఇన్‌చార్జి రవికుమార్‌యాదవ్ ప్రారంభించారు. వేసవిలో పాదచారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఉపయోగపడతాయని అన్నారు. చలివేంద్రాన్ని ఏర్పాటు చేసిన సీతారామరాజును ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఉద్భవ ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ రాజశేఖర్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

పలుచోట్ల అభివృద్ధి పనులు ప్రారంభించి మాట్లాడిన శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

కూకట్‌పల్లి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని పాపిరెడ్డినగర్‌లో 95శాతం రోడ్డు పనులు పూర్తిచేశామని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. బుధవారం శేరిలింగంపల్లి నియోజకవర్గం, కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని పాపిరెడ్డినగర్, దీనబంధూకాలనీ, ఆస్‌బెస్టస్ కాలనీలో రూ.1.47 లక్షలతో నిర్మించే రోడ్డు పనులను కూకట్‌పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణతో కలిసి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ, నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు. త్వరలో నాలా పనులు ప్రారంభిస్తామన్నారు. వర్షాకాలంలో ఇళ్లలోకి వరదనీరు రాకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పాపిరెడ్డికాలనీలో ఒకటో రెండో రోడ్లు మినహా అన్ని రోడ్లు పూర్తిచేశామని, అవి కూడా వీలైనంత త్వరగా పూర్తిచేస్తామన్నారు. మౌలికవసతులకు పెద్దపీట వేస్తున్నామని, నాణ్యత విషయంలో రాజీ పడబోమన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు చంద్రారెడ్డి, అస్‌బెస్టాస్‌కాలనీ నరేశ్, మున్సిపల్ ఈఈ గోవర్ధన్, ఏఈ సాయిప్రసన్న, కాంగ్రెస్ పార్టీ నాయకులు చిట్టిరెడ్డి శ్రీధర్‌రెడ్డి, సంజీవరెడ్డి, చంద్రకాంతరావు, రామకృష్ణారెడ్డి, రాజిరెడ్డి, దేవేందర్ రెడ్డి కాలనీవాసులు పాల్గొన్నారు.



బాగ్ అమీర్ కాలనీలో బీటీ, సీసీరోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్ రోజాదేవి

వివేకానందనగర్ డివిజన్‌లో...

హైదర్‌నగర్, ఏప్రిల్23 (ఆంధ్రజ్యోతి): వివేకానందనగర్ డివిజన్ శ్రీనివాస నగర్, వడ్డేపల్లి ఎన్‌క్లేవ్, దీనబంధుకాలనీ బ్రిడ్జి వరకు, బాగ్ అమీర్ కాలనీలో రూ.1.6 కోట్లతో చేపట్టబోయే బీటీ, సీసీరోడ్డు నిర్మాణ పనులకు కార్పొరేటర్ రోజాదేవితో కలిసి ఎమ్మెల్యే గాంధీ శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ, బీటీ, సీసీరోడ్ల పనులను నాణ్యతలో రాజీపడకుం డా పూర్తిచేయాలని, త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.



హిందూ శ్మశాన వాటిక వద్ద డివిజన్ నాయకులతో కార్పొరేటర్ నర్సింహయాదవ్

శ్మశాన వాటిక అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఓల్డుబోయినపల్లి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఓల్డుబోయినపల్లి డివిజన్‌ను సమస్యలు లేని ఆదర్శవంతమైన డివిజన్‌గా తీర్చి దిద్దడమే తన లక్ష్యమని కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ అన్నారు. బుధవారం ఉదయం ఓల్డుబోయినపల్లి డివిజన్‌లోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు జీహెచ్‌ఎంసీ అధికారులు, బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, డివిజన్‌లోని శ్మశాన వాటికల అభివృద్ధికి నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చొరవ వల్లనే అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యాయని అన్నారు. హస్మత్‌పేట హిందూ శ్మశాన వాటిక అభివృద్ధికి రూ. కోటి, ప్రహరీ గోడ నిర్మాణానికి రూ కోటి, క్రిస్టియన్ల శ్మశాన వాటిక అభివృద్ధికి రూ. 20 లక్షల నిధులు మంజూరయ్యాయని అన్నారు. నాణ్యతతో 3 నెలల్లో పనులను పూర్తిచేసి తనపై డివిజన్ ప్రజలకు ఉన్న నమ్మకాన్ని నిజం చేస్తానని కార్పొరేటర్ హామీ ఇచ్చారు. నిధులు మంజూరు చేసిన జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌కు, అధికారులకు, నిధుల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే కృష్ణారావుకు కార్పొరేటర్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఏఈ ఆశ, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, వాటర్ వర్క్స్ మేనేజర్ తేజ, డివిజన్ నాయకులు హరినాథ్, నియోజకవర్గ మైనారిటీ అధ్యక్షుడు సయ్యద్ ఎజాజ్, సీనియర్ నాయకులు గడ్డం నర్సింగ్‌రావు, మట్టి శ్రీనివాస్, బుర్రి యాదగిరి, పోచయ్య, రాజూగౌడ్, పెంటయ్య, జనార్ధన్, భిక్షపతి, శివకుమార్, సీతారాం, డా.సుధాకర్ పాల్గొన్నారు.

కార్పొరేటర్‌కు ప్రశంసల వెల్లువ

కాంగ్రెస్ ప్రభుత్వం నిధులను మంజూరు చేస్తుందో లేదోననే అనుమానం ఇప్పటి వరకు తమలో ఉండేదని, కానీ ఇంతకాలం పెండింగ్‌లో ఉన్న హస్మత్‌పేట హిందూ శ్మశానవాటిక, క్రిస్టియన్ల శ్మశాన వాటిక అభివృద్ధికి నిధులు మంజూరు కావడంపై అర్జున్ బస్తీ, గంగపుత్ర కాలనీ కమిటీ సభ్యులు, వడ్డెర బస్తీ సంఘం సభ్యులు, చర్చి పాస్టర్లు కార్పొరేటర్‌ను ప్రశంసలతో ముంచెత్తారు.

ఉగ్రమూకలకు బుద్ధి చెప్పాల్సిందే



కూకట్‌పల్లిలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

కూకట్‌పల్లి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): జమ్మూకశ్మీర్‌లో ఉగ్రమూకలు అమాయక ప్రజలను, టూరిస్టులను 28 మందిని పొట్టన పెట్టుకున్నారని ఇలాంటి దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు అన్నారు. ఎమ్మెల్యే క్యాంపుకార్యాలయంలో వారు మాట్లాడుతూ, ఉగ్రదాడిలో మృతి చెందిన కుటుంబాలకు తీవ్ర సంతాపం ప్రకటించారు. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని వారికి మెరుగైన వైద్యసేవలు అందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలన్నారు.

కూకట్‌పల్లిలో కొవ్వొత్తుల ర్యాలీ..



వివేకానందనగర్ డివిజన్ అధ్యక్షుడు వంశీరెడ్డి ఆధ్వర్యంలో నివాళులు

పహల్గామ్ ఉగ్రదాడితో యావత్ ప్రపంచం ఉలిక్కిపడిందని బీజేపీ కూకట్‌పల్లి అసెంబ్లీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు అన్నారు. ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి శాంతి చేకూరాలని కోరుతూ బుధవారం కూకట్‌పల్లి అసెంబ్లీ బీజేపీ కార్యాలయం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి ఉగ్రదాడికి పాల్పడిన వారి దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. అనంతరం కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు.

నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన

కేపీహెచ్‌బీకాలనీ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : జమ్మూ కాశ్మీర్ పహల్గామ్‌లో పర్యాటకులపై జరిగిన దాడికి జనసేన పార్టీ నాయకులు నిరసన తెలిపారు.

కేపీహెచ్‌బీ ఐదోఫేజ్‌లోని పార్టీ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు శంకర్ గౌడ్, ప్రచార కార్యదర్శి సాగర్, కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి ముమ్మారెడ్డి ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు. జనసేన పార్టీ ఆధ్వర్యంలో వరుసగా మూడు రోజుల పాటు నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.



నిజాంపేట్ చౌరస్తాలో బీజేపీ నాయకులు

మృతులకు నివాళులు

హైదర్‌నగర్, ఏప్రిల్23 (ఆంధ్రజ్యోతి): పహల్గవ్ దుర్ఘటనపై వివేకానందనగర్ డివిజన్ అధ్యక్షుడు డాక్టర్ వంశీరెడ్డి ఆధ్వర్యంలో కొవ్వొత్తులు వెలిగించి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు కోరదలా నరేష్ హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ నరేష్, గోపాల్, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తగిన మూల్యం చెల్లించాల్సిందే..

దాడికి ప్రతిదాడి తగిన మూల్యం చెల్లించాల్సిందేనని బీజేపీ కార్యవర్గ సభ్యులు రవికుమార్‌యాదవ్ అన్నారు. నిజాంపేట్ చౌరస్తాలో బీజేపీ నాయకులతో కలిసి ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. కార్యక్రమంలో నాయకులు రవీందర్‌రావు, కేశవులు, మణిభూషణ్, నర్సింగ్‌యాదవ్, డాక్టర్ వంశీరెడ్డి, నర్సింగ్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



కేపీహెచ్‌బీలో జనసేన పార్టీ నాయకులు

లక్ష్మీగణపతి ఆలయంలో ముగిసిన బ్రహ్మోత్సవాలు

చందానగర్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): చందానగర్ శిల్పాఎన్‌క్లేవ్‌లోని లక్ష్మీ గణపతి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారంతో ముగిశాయి. చివరి రోజు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారికి పూజలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అభిషేకాలు, అష్టోతరశత కళశాభిషేకం, చతురవృత్తి తర్పణములు, యంత్రార్చన, పూర్ణాహుతి సహా పలు కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం స్వామివారి ఊరేగింపు కార్యక్రమం ఘనంగా సాగింది. ఆలయ చైర్మన్ రమణమూర్తి ఏర్పాట్లను పర్యవేక్షించారు.



పుష్పాలంకరణలో లక్ష్మీగణపతిస్వామి



ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేస్తున్న రవికుమార్‌యాదవ్ తదితరులు

కశ్మీర్ ఉగ్రదాడిని ఖండిస్తూ నిరసన

హైదర్‌నగర్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లో పర్యాటకులపై దాడికి పాల్పడిన ఉగ్రవాదులు మూల్యం చెల్లించాల్సిందేనని బీజేపీ కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్ అన్నారు. కశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడులకు నిరసనగా బుధవారం నిజాంపేట్ చౌరస్తాలో బీజేపీ నాయకులతో కలిసి ఆయన ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు. పహల్గామ్‌లో గుర్తింపు కార్డులు చూసి మతం ఆధారంగా పర్యాటకులను కాల్చిచంపడం హేయమైన చర్య అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సురభి రవీందర్రావు, రామరాజు, కేశవులు, మణిభూషణ్, నర్సింగ్‌యాదవ్, డాక్టర్ వంశీరెడ్డి, నర్సింగ్‌యాదవ్, గోపాల్‌రావు, మహేష్‌యాదవ్, వెంకటస్వామిరెడ్డి, ఎత్తరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



రహదారిపై ప్రమాదకరంగా ఉన్న మ్యాన్‌హోల్

రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా మ్యాన్‌హోల్

మియాపూర్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా ఉన్న మ్యాన్‌హోల్‌తో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. హెచ్ఎంటీ స్వర్ణపురి కమ్యూనిటీ హాల్ నుంచి ఆటో స్టాండ్‌కు వెళ్లే రహదారిలో నెల రోజుల క్రితం మ్యాన్‌హోల్ కుంగిపోయింది. నెల రోజుల నుంచి ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

లక్ష్మీగణపతి ఆలయంలో ముగిసిన బ్రహ్మోత్సవాలు



పుష్పాలంకరణలో లక్ష్మీగణపతిస్వామి

చందానగర్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): చందానగర్ శిల్పాఎన్‌క్లేవ్‌లోని లక్ష్మీగణపతి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారంతో ముగిశాయి. చివరి రోజు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారికి పూజలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అభిషేకాలు, అష్టోతర శత కళశాభిషేకం, చతురవృత్తి తర్పణములు, యంత్రార్చన, పూర్ణాహుతి సహా పలు కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం స్వామివారి ఊరేగింపు కార్యక్రమం ఘనంగా సాగింది. ఆలయ చైర్మన్ రమణమూర్తి ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ఫాగింగ్ చేస్తున్న జీహెచ్ఎంసీ కార్మికుడు

దోమల నివారణకు చర్యలు

గచ్చిబౌలి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): విజృంభిస్తున్న దోమలు అనే శీర్షికతో ఈ నెల 19న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి జీహెచ్ఎంసీ ఎంటమాలజీ అధికారులు స్పందించారు. బస్తీలు, కాలనీల్లో దోమల నివారణ చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఆదర్శనగర్‌లో బుధవారం సాయంత్రం ఫాగింగ్ చేశారు. దోమల నివారణ కోసం చర్యలు తీసుకుంటామని, గోపి చెరువులో ఉన్న గుర్రపు డెక్కను తొలగిస్తామని జీహెచ్ఎంసీ అధికారులు చెప్పారు.



చలివేంద్రాన్ని ప్రారంభించిన జగదీశ్వర్‌గౌడ్

చలివేంద్రం ప్రారంభం

గచ్చిబౌలి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): వేసవికాలంలో చలివేంద్రాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని శేరిలింగంపల్లి కాంగ్రె పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. బుధవారం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నల్లగండ్ల అపర్ణ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. వేసవిని దృష్టిలో ఉంచుకొని చలివేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. దాతలు ముందుకు వచ్చి అవసరం ఉన్న ప్రాంతాల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేస్తే తాను సహకారం అందిస్తానన్నారు. పాదచారులు, దినసరి కూలీలు చలివేంద్రాలను వినియోగించుకోవాలని ఆయన సూచించారు. చలివేంద్రంలో ప్రతిరోజూ 2000 మందికి మజ్జిగ పంపిణీ చేస్తామని అపర్ణ జనీత్ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు విజయ భాస్కర్‌రెడ్డి, జావేద్, భరత్, రవి, నరేందర్, ప్రదీప్ పాల్గొన్నారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం లభ్యం

చందానగర్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహాన్ని చందానగర్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. లింగంపల్లి రైల్వేస్టేషన్ సమీపంలోని ఫుట్‌పాత్‌పై ఓ వృద్ధుడు మృతిచెంది ఉన్నాడని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. మృతుడి వయస్సు 65-70 ఏళ్లు ఉంటుందన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి తరలించారు.

అపరిశుభ్రతకు నిలయంగా రహదారులు

- ఇళ్లలోని చెత్త, వ్యర్థాలను రోడ్లపై వేస్తున్న ప్రజలు
- అవగాహన కల్పించడంలో విఫలమవుతున్న అధికారులు
- కఠిన చర్యలు తీసుకుంటేనే మార్పు సాధ్యమంటున్న స్థానికులు



చందానగర్ ఎంఎంటీఎస్ రైల్వేస్టేషన్ నుంచి ఆర్టీసీ కాలనీ వెళ్లే రహదారిలో చెత్త, వ్యర్థాలు

చందానగర్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలోని పలు రహదారులు అపరిశుభ్రతకు నిలయంగా మారుతున్నాయి. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు పరిశుభ్రంగా కనిపించే రోడ్లు ఉదయం చూడగానే రహదారుల వెంబడి పెద్ద ఎత్తున చెత్త కుప్పలు కనిపిస్తున్నాయి. దీంతో తీవ్ర దుర్వాసన వస్తుందని పాదచారులు, వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ప్రజలకు అవగాహన కల్పించడంలో విఫలం కావడంతోనే రోడ్లపై చెత్త వేస్తున్నారని పారిశుధ్య కార్మికులు అంటున్నారు. రోడ్లపై పెద్ద ఎత్తున చెత్త వేస్తుండటంతో తమకు కూడా ఇబ్బందికరంగానే ఉంటుందని వారు చెబుతున్నారు. ఇష్టానుసారంగా చెత్త వేసే వారిపై చర్యలు తీసుకోవాలని, భారీగా జరిమానా విధించాలని స్థానికులు కోరుతున్నారు. చందానగర్ సర్కిల్ పరిధిలోని హుడా కాలనీ ఫేజ్-2లో సాయిబాబా ఆలయం నుంచి చందానగర్ ఎంఎంటీఎస్ స్టేషన్ రోడ్డు పొడవునా, రైల్వే స్టేషన్ నుంచి మంజీరా రోడ్డు ఆర్టీసీ కాలనీ వరకు.. గంగారంలోని అంతర్గత రోడ్లపై, శాంతినగర్, ఇందిరానగర్, భవానీపురం వీకర్ సెక్షన్ కాలనీ, వేముకుంట, మదీనాగూడ విలేజ్, మియాపూర్ న్యూకాలనీ, సుభాష్‌చంద్రబోస్ నగర్ కాలనీ, ప్రశాంత్‌నగర్, ఓల్డ్ హఫీజ్‌పేట్ తదితర కాలనీల్లో రోడ్లపై చెత్త, వ్యర్థాలను వేస్తున్నారు. శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని ఎన్‌టీఆర్‌నగర్, ఎన్‌టీఆర్‌నగర్ తాండ, గోపన్‌పల్లి తాండ, కేశవనగర్, గౌలిదొడ్డి, నానక్‌రామ్‌గూడ విలేజ్, మధురానగర్, రాయదుర్గం ముస్లిం బస్తీ, గచ్చిబౌలి, ఇందిరానగర్, అంజయ్య నగర్, నేతాజీ నగర్, నెహ్రూనగర్, గోపినగర్, పాపిరెడ్డికాలనీ, సందయ్యనగర్, రాజీవ్ గృహకల్ప, మసీద్‌బండ విలేజ్, హఫీజ్‌పేట తదితర ప్రాంతాల్లో ఇదే పరిస్థితి నెలకొంది.



హుడాకాలనీ నుంచి చందానగర్ వెళ్లే రోడ్డులో పేరుకుపోయిన చెత్త

గతంలో అవగాహన కార్యక్రమాలు

చెత్త నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో స్వచ్ఛ సర్వేక్షన్, స్వచ్ఛ హైదరాబాద్ కార్యక్రమంలో భాగంగా ప్రజలకు పెద్ద ఎత్తున అవగాహన కల్పించడంతో మంచి ఫలితాలు సాధించారు. దీంతో తడి పొడి చెత్తను వేర్వేరుగా స్వచ్ఛ ఆటోలకు అందించే విధానం అప్పట్లో అలవాటుగా మారింది. అయితే ఇది జరిగి చాలా రోజులు కావడంతో ప్రజలు ఆ విధానం పాటించడం లేదు. ప్రస్తుతం ఇళ్లలోని చెత్త, వ్యర్థాలను తీసుకొచ్చి రోడ్లపై వేస్తుండటంతో అపరిశుభ్రత వాతావరణం నెలకొంటుంది. అధికారులు స్పందించి ప్రజలు మరోసారి అవగాహన కల్పించడంతో పాటు పెద్ద ఎత్తున జరిమానాలు విధిస్తే ప్రజల్లో మార్పు వస్తుందని స్థానికులు చెబుతున్నారు. సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేసి రోడ్లపై చెత్త వేసే వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

రోడ్లపై చెత్త వేసేవారిని గుర్తించి చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే పలు ప్రాంతాల్లో చెత్త వేస్తున్న వారిని గుర్తించి జరిమానాలు విధిస్తున్నాం. పదేపదే వ్యర్థాలను వేసే వారిపై కేసులు సైతం నమోదు చేస్తాం.

\- డాక్టర్.రవి, చందానగర్, ఏఎంహెచ్ఓ

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

- ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్ రోజాదేవి

హైదర్‌నగర్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని శ్రీనివాసనగర్, వడ్డేపల్లి ఎన్‌క్లేవ్, దీనబంధు కాలనీ బ్రిడ్జి వరకు రూ.కోటి 6 లక్షల వ్యయంతో నూతనంగా చేపట్టనున్న బీటీ, సీసీ రోడ్డు పనులకు కార్పొరేటర్ రోజాదేవితో కలిసిఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ.. ప్రజల సంక్షేమం, శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని, నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శవంతంగా తీర్చిదిదుతామని ఆయన పేర్కొన్నారు.

హఫీజ్‌పేట, మాదాపూర్ డివిజన్లలో..

మియాపూర్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): హఫీజ్‌పేట, మాదాపూర్ డివిజన్ల పరిధిలో సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే గాంధీ బుధవారం శంకుస్థాపన చేశారు. హఫీజ్‌పేట డివిజన్‌లో రూ.4.22 కోట్లతో, మాదాపూర్ డివిజన్ పరిధిలో రూ.8.32 కోట్లతో నిర్మించే నూతన రోడ్డు పనులకు కార్పొరేటర్లు పూజిత, జగదీశ్వర్‌గౌడ్‌తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. పనులు జరిగే సమయంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా చూడాలని, త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు.

పాఠశాల భవనానికి శంకుస్థాపన..

గచ్చిబౌలి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేస్తుందని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. బుధవారం గచ్చిబౌలి బడ్డెర బస్తీలో ప్రాథమిక పాఠశాల నూతన భవన నిర్మాణానికి ఆయన శంకుసాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాల పాత భవనం రోడ్డు విస్తరణలో పోవడంతో కొత్త భవనాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే భవన నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. రూ.2 కోట్ల నిధులతో పాఠశాల భవనాన్ని నిర్మిస్తున్నామని, విశాలమైన తరగతి గదులతో పాటు అన్ని సౌకర్యాలతో భవనాన్ని అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి, ఉపకమిషనర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాద మూకలపై ఆగ్రహం



కశ్మీర్ ఉగ్రదాడికి నిరసనగా బుధవారం రాత్రి శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహకల్పలో యువత కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. మృతులకు సంతాపం తెలిపారు.

\- చందానగర్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి)

మృతుల కుటుంబాలకు సంఘీభావం



పహల్గామ్ ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన పర్యాటకుల కుటుంబాలకు సంఘీభావంగా బుధవారం రాత్రి రాయదుర్గం సంఘ్ పరివార్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు.

\- గచ్చిబౌలి, (ఆంధ్రజ్యోతి)



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

ఎన్నికల హామీలను ప్రభుత్వం నెరవేర్చాలి

- సీపీఐ మండల కార్యదర్శి రామకృష్ణ

గచ్చిబౌలి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు మారినా పేదల బతుకులు మారడం లేదని సీపీఐ శేరిలింగంపల్లి మండల కార్యదర్శి రామకృష్ణ అన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నేతలు పట్టించుకోవడం లేదని.. ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని విమర్శించారు. బుధవారం కొండాపూర్ డివిజన్‌కు సంబంధించిన మహా సభ పార్టీ సీనియర్ నాయకుడు నారాయణ ఆధ్వర్యంలో ప్రేమ్‌నగర్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రామకృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన పేదలందరికి ఇళ్లు ఇస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చి 15 నెలలు గడిచినా హామీని అమలు చేయలేదన్నారు. అర్హులను గుర్తించి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సుధాకర్, రామస్వామి, కొండయ్య, వెంకటేశ్, సల్మాన్, రఘు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటా

- కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

హైదర్‌నగర్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని విజయనగర్ కాలనీలో డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణ పనులు పూర్తి చేసిన సందర్భంగా కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్‌ను కలిసి సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. కాలనీలో ఎటువంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానన్నారు. తనతో పాటు ఎమ్మెల్యే గాంధీ డివిజన్ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో విజయనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సత్యనారాయణ, జనరల్ సెక్రెటరీ స్వరూప, ఉపాధ్యక్షుడు మురళీకృష్ణ మోహన, లింగారెడ్డి, శ్రీధర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్‌ను సన్మానిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

జీహెచ్ఎంసీ సీల్ తొలగించిన ఇద్దరిపై కేసు

అల్లాపూర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పరిమిత అంతస్తులకు మించి నిర్మాణాలు చేపట్టారంటూ సీజ్ చేసిన భవనాలకు వేసిన సీల్ తొలగించిన ఇద్దరు వ్యక్తులపై క్రిమినల్ కేసు నమోదైంది. వివరాల్లోకి వెళ్తే.. అల్లాపూర్ డివిజన్ పరిధిలోని గాయత్రి నగర్‌లో ప్లాట్ నెం.371 ఇంటి యజమాని మూడు అంతస్తులకు అనుమతులు తీసుకున్నాడు. అయితే నిబంధనలకు విరుద్ధంగా నాలుగు, ఐదు అంతస్తులను అక్రమంగా నిర్మించాడు. దీంతో గత నవంబరులో టీజీబీపాస్ యాక్ట్ 2020 ప్రకారం యజమానిపై కేసు నమోదు చేయించిన అధికారులు షోకాజ్ నోటీసులు అందజేశారు. అనంతరం గత డిసెంబరులో అక్రమ అంతస్తులను తొలగించాలంటూ జీహెచ్ఎంసీ అధికారులు స్పీకింగ్ ఆర్డర్ జారీ చేశారు. ఇంత జరిగినా నిర్మాణదారుడు, యజమాని అధికారుల ఉత్తర్వులను పాటించకపోవడం, అధికారులు వేసిన సీల్ తొలగించడం, రాత్రిళ్లు నిర్మాణ పనులు చేపట్టినందుకుగాను జి.మణెమ్మ, జి.ఉమామహేశ్వర్ అనే ఇద్దరిపై అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. జీహెచ్ఎంసీ నియమాలను ఉల్లంఘించారంటూ మూసాపేట్ ఉప కమిషనర్ వంశీకృష్ణ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అల్లాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముగ్గురు గంజాయి విక్రయదారుల అరెస్ట్

- 5.26 కేజీల గంజాయి స్వాధీనం



సికింద్రాబాద్‌లో గంజాయితో పట్టుబడ్డ నిందితులతో ఎక్సైజ్ పోలీసులు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): నగరంలో గంజాయి విక్రయాలు జరుగుతున్నాయనే విశ్వసనీయ సమాచారం మేరకు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పోలీసులు బృందాలుగా ఏర్పడి పలు ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా సికింద్రాబాద్, శేరిలింగంపల్లి ప్రాంతాల్లో ముగ్గురు స్మగ్లర్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న 5.26 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్‌కు చెందిన మలావత్ రాజేందర్, ఇందాల రాథోడ్ కొంత కాలంగా ఆదిలాబాద్‌లో దొరికే గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసి హైదరాబాద్‌కు కారులో తీసుకొస్తున్నారు. ఇక్కడ వినియోగదారులకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. బుధవారం సికింద్రాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని బోయిన్‌పల్లిలో గంజాయి విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు సీఐ సౌజన్య ఆధ్వర్యంలో దాడి చేసి ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. 4.10 కేజీల గంజాయి, కారు, మూడు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు.

కొండాపూర్‌లో..

శేరిలింగంపల్లి పరిధిలోని కొండాపూర్‌లో గంజాయి విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం అందుకున్న శేరిలింగంపల్లి ఎక్సైజ్ ఎస్టీఎఫ్ (స్టేట్ టాస్క్‌ఫోర్స్) సిబ్బంది రంగంలోకి దిగారు. పశ్చిమబెంగాల్‌కు చెందిన నారాయణ చౌదరిని అరెస్టు చేశారు. అతడు ఇతర ప్రాంతాల నుంచి నగరానికి గంజాయిని తీసుకొచ్చి ఐటీ కారిడార్‌లోని వినియోగదారులను లక్ష్యంగా చేసుకొని విక్రయాలు చేస్తున్నట్లు తేలింది. అతడి వద్ద ఉన్న 1.12 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడిలో ఎస్టీఎఫ్ ఎస్సై జ్యోతి, హెడ్ కానిస్టేబుల్ లేఖా సింగ్, కానిస్టేబుళ్లు రాజేశ్వర్, చంద్రశేఖర్, కాశీరావు, శశి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు సహకరించండి

- బీహెచ్ఈఎల్ సంస్థ ఈడీని కోరిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



సంస్థ ఈడీ భరణీధర్‌రాజుకు వినతిపత్రం అందజేస్తున్న పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

భెల్‌కాలనీ, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): బీహెచ్ఈఎల్ పరిసర ప్రాంతాల్లో ప్రభుత్వం చేపడతున్న అభివృద్ధి పనులకు యాజమాన్యం అడ్డుతగలడం సరికాదని, సమస్యల పరిష్కారానికి సహకారం అందించాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.భరణీధర్‌రాజును కోరారు. బుధవారం పరిపాలన భవనంలో స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే ఆయనతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనులపై చర్చించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈఎస్ఐ చర్చి సమీపంలో బీరప్ప దేవాలయాన్ని బీహెచ్ఈఎల్ స్థలంలో నిర్మించారని చెప్పి ఆలయాన్ని తొలగించారన్నారు. వాంబే కాలనీ సమీపంలో పరిశ్రమ ప్రహరీకి ఆనుకుని దశాబ్దకాలం క్రితం పాడిరైతులు పశువుల పాకలు వేసుకున్నారని, వాటికి సైతం తొలగించాలని నోటీసులు ఇచ్చారన్నారు. రామసముద్రం చెరువు సమీపంలోని మసీదు నిర్మాణం సైతం భెల్ పరిధిలో ఉందంటూ ఇటీవల నోటీసులు ఇచ్చారని.. సమస్యలపై యాజమాన్యం స్పందించి పరిష్కరించాలని సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.భరణీధర్‌రాజును ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి కోరారు. బీరప్ప దేవాలయ నిర్మాణం సున్నితమైన అంశమని, భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకొని నిర్మాణానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్పానగేష్ యాదవ్, మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య యాదవ్, ఊరుక్ల రాజు, ఐలేష్, కరిక సత్యనారాయణ, అంజయ్య, యాదగిరి, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.


జన సంచారం లేక ఖాళీగా దర్శనమిస్తున్న కుత్బుల్లాపూర్ నుంచి చింతల్ వైపు వెళ్లే రోడ్డు

భానుడి భగభగ.. రోడ్లు నిర్మానుష్యం

కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : రోజు రోజుకూ భానుడు ఉగ్రరూపం దాలుస్తూ ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నాడు. బుధవారం 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు ఇష్టపడలేదు. తప్పనిసరి పరిస్థితులు ఉన్న వారు తప్ప ఎవరూ బయటకు రాకపోవడంతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలు రోడ్లు ఖాళీగా దర్శనమిచ్చాయి.


నిర్మానుష్యంగా మారిన కాకతీయనగర్‌లోని మార్కెట్ రోడ్డు

అనుమతులు లేని హోర్డింగ్‌ల తొలగింపు

పేట్‌బషీరాబాద్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేని హోర్డింగ్‌లపై హైడ్రా, మున్సిపల్ అధికారులు కొరడా ఝులిపించారు. కొంపల్లి పురపాలక సంఘం పరిధిలోని గుండ్ల పోచంపల్లికి వెళ్లే దారిలో పాలమ్ మెడోస్ విల్లాస్ వద్ద, దూలపల్లి స్టేట్ బ్యాంక్‌కు ఎదురుగా నిర్మించిన నాలుగు భారీ హోర్డింగ్‌లను గ్యాస్ కట్టర్స్, భారీ క్రేన్ సహాయంతో అధికారులు బుధవారం తొలగించారు. అనుమతులు తీసుకోకుండా హోర్డింగ్స్ కటౌట్లు ఏర్పాటు చేస్తే మున్సిపల్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.


భారీ క్రేన్‌లతో హోర్డింగ్స్‌ను తొలగిస్తున్న దృశ్యం


సుదర్శన్‌రెడ్డినగర్‌లో సీసీ రోడ్డును తవ్వి పైప్‌లైన్ వేస్తున్న దృశ్యం

ఇష్టానుసారంగా రోడ్డు తవ్వకం.. పట్టించుకోని అధికార గణం

కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు సౌకర్యంగా ఉండేందుకు ఇంజనీరింగ్ విభాగం అధికారులు ప్రతి కాలనీలో అంతర్గత రోడ్లను అద్దంలా వేస్తున్నారు. కాలనీల్లో ముందుగా డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్లు వేసి, ఇళ్లకు కనెక్షన్లు ఇచ్చిన తర్వాతే రోడ్డును వేస్తారు. అయితే, అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా కొందరు తమ ఇళ్లకు, అపార్టుమెంట్లకు పైప్‌లైన్ల కనెక్షన్లు ఇచ్చేందుకు తవ్వి ధ్వంసం చేస్తున్నారు. కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధిలోని సుదర్శన్‌రెడ్డినగర్‌లో లక్షలాది రూపాయలు వెచ్చించి సీసీ రోడ్డు వేశారు. అయితే బుధవారం కాలనీలోని చిలుకూరి బాలాజీ రెసిడెన్సీ నిర్వాహకులు ఎలాంటి అనుమతి లేకుండానే రోడ్డు తవ్వి పైప్‌లైన్లు వేస్తున్నారని స్థానికులు వాపోయారు. ప్రజల సొమ్ముతో నిర్మించిన రోడ్లను ఇలా ధ్వంసం చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వారు ఆరోపిస్తున్నారు. ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


గాయపడ్డ వృద్ధుడిని అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తున్న పోలీసులు

భవనంపై నుంచి పడి వృద్ధుడికి గాయాలు

షాపూర్‌నగర్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): భవనం మొదటి అంతస్తు నుంచి ప్రమాదవశాత్తూ కిందపడి ఓ గుర్తుతెలియని వృద్ధుడు గాయపడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం.. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సూరారం డివిజన్, వెంకట్రామ్‌నగర్ నార్త్‌సిటీ హైస్కూల్ వెనుక వీధిలో ఉండే భవనం మొదటి అంతస్తు నుంచి బుధవారం ఓ వృద్ధుడు ప్రమాదవశాత్తూ కిందపడిపోయాడు. పోలీసులు అతడిని అంబులెన్స్‌లో సూరారంలోని మల్లారెడ్డి నారాయణ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

ప్రాణం తీసిన ఈత సరదా

● క్వారీ గుంతలో ఈత కొడుతూ ఇంటర్ విద్యార్థి మృతి

జీడిమెట్ల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): స్నేహితులతో కలిసి క్వారీ గుంతలో ఈతకు వెళ్లిన ఓ యువకుడు ఊపిరాడక మృతి చెందాడు. జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలోని గాజులరామారం ప్రాంతంలో బుధవారం మధ్యాహ్నం ఈ విషాద ఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... భౌరంపేట్ సమీపంలోని ఇందిరమ్మ ఇళ్లల్లో నివాసముంటున్న సెక్యూరిటీ గార్డు వెంకటరావు కుమారుడు మణిసుందర్ కుమార్ అలియాస్ జై (20) కూకట్‌పల్లిలోని ఐ క్రియేట్ కాలేజీలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్నాడు. బుధవారం మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో గాజులరామారం సర్వే నెంబర్ 307 సమీపంలోని క్వారీ గుంతల వద్దకు మరో ముగ్గురు స్నేహితులతో కలిసి జై ఈతకు వచ్చాడు. ఇతడికి ఈత సరిగా రాదు. 1.30 గంటలకు జై ఈత కొట్టేందుకు నీటిలో దిగాడు. లోతైన ప్రాంతంలో ఊపిరాడక నీటి లో మునిగిపోయాడు. స్నేహితులు, స్థానికులు అతని రక్షించేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండాపోయింది. సాయంత్రం 4 గంటలకు మృతదేహాన్ని గుర్తించారు. తండ్రి వెంకటరావు ఫిర్యాదు మేరకు జగద్గిరిగుట్ట పోలీసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు.


మణిసుందర్‌కుమార్ మృతదేహం

నల్లాలకు మోటర్లు బిగిస్తే కేసులే!

● కొనసాగుతున్న జలమండలి అధికారుల దాడులు
● 5 మోటర్ల సీజ్, జరిమానా విధింపు

పేట్‌బషీరాబాద్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): నల్లాలకు విద్యుత్ మోటర్లను బిగించి అక్రమంగా నీటిని తోడుతున్న వినియోగదారులపై కుత్బుల్లాపూర్ జలమండలి అధికారులు దాడులు నిర్వహిస్తున్నారు. ఈ నెల 15 నుంచి ప్రారంభమైన 'మోటరు ఫ్రీ ట్యాప్' కార్యక్రమంలో భాగంగా కుత్బుల్లాపూర్ జలమండలి జీఎం అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించి 5 మోటర్లును సీజ్ చేసి, జరిమానా విధించారు. మరోసారి ఇదే విధంగా పట్టుబడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.


అధికారులు స్వాధీనం చేసుకున్న మోటర్లు

3 సబ్ డివిజన్లు... 10 సెక్షన్లు

కుత్బుల్లాపూర్ జలమండలి డివిజన్ 12లో మొత్తం 3 సబ్-డివిజన్లు ఉన్నాయి. చింతల్ సబ్-డివిజన్-1, షాపూర్‌నగర్ సబ్-డివిజన్-2, జగద్గిరిగుట్ట సబ్-డివిజన్-3ల్లో 10 సెక్షన్‌లు ఉన్నాయి. సుచిత్రా, జీడిమెట్ల, చింతల్, సబ్-డివిజన్-1లోకి వస్తాయి. గాజులరామారం, సూరారం, షాపూర్‌నగర్ సబ్-డివిజన్-2కు రాగా, ఆదర్శనగర్, భగత్‌సింగ్‌నగర్, జగద్గిరిగుట్ట, ఉషోదయ సెక్షన్‌లు సబ్-డివిజన్-3 కిందకి వస్తాయి.

మొత్తం 68 వేల కనెక్షన్లు...

ఈ సెక్షన్ల పరిధిలో దాదాపు 68 వేల డొమెస్టిక్, కమర్షియల్ కనెక్షన్లు ఉన్నాయి. నీటి సరఫరా జరుగుతున్న సమయంలో మోటర్లు ద్వారా నీటిని తోడుతున్న వారిని, నల్లా నీటితో వాహనాలను కడగడం, నీటి సరఫరా జరుగుతున్నప్పుడు ఇళ్ల ముందు కడగడం, రోడ్డుపైకి నల్లా నీటిని వృథాగా వదిలేయడం వంటివి చేస్తున్న వారిని గుర్తించి జరిమానాలు విధిస్తున్నారు. నల్లా పైపులకు బిగించిన మోటర్లను స్వాధీనం చేసుకోవడంతో పాటు జరిమానాలు విధిస్తున్నారు. మరోసారి మోటర్లతో నల్లా నీటిని తోడుతూ పట్టుబడితే కనెక్షన్లు తొలగిస్తామని వినియోగదారులను జలమండలి అధికారులు హెచ్చరిస్తున్నారు. నీటిని పొదుపుగా వాడుకోవాలని దాడుల చేస్తున్న అధికారులు ప్రజలకు సూచిస్తున్నారు.

ప్రతీ ఇంటికి తాగునీరు అందించేందుకు కృషి

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రతీ ఇంటికి తాగు నీరు చేరే విధంగా చర్యలు చేపడుతున్నాం. నల్లా పైప్‌లకు మోటర్లు బిగించి, అధికంగా నీరు వాడకుండా దాడులు నిర్వహిస్తున్నాం. ఎవరైనా మోటర్లు పెట్టి నీటిని అధి కంగా వాడితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని, జరిమానా విధించి, కేసులు నమోదు చేస్తాం.

- జీడిమెట్ల, డీజీఎం రాజేష్

2016-18లో కేటాయించిన నీరే నేటికీ సరఫరా..

కుత్బుల్లాపూర్‌లో 2016-18లో కేటాయించిన 23 ఎంజీడీల నీరే ఇప్పటికీ సరఫరా అవుతోంది. అప్పటి నుంచి ఇప్పటికి కుత్బుల్లాపూర్ జనాభా సుమారు 7 లక్షలకు పెరిగింది. అనేక కొత్త కాలనీలు వెలిశాయి. పెరిగిన జనాభా అవసరాలకు అనుగుణంగా నీటి సరఫరాను 35 ఎంజీడీలకు పెంచుకోవాల్సిన పరిస్థితి ఉందని అధికారులు అంటున్నారు. ప్రస్తుతం సరఫరా అవుతున్న నీరు వృథా కాకుండా అందరికీ అందించేందుకు అధికారులు నీటి వాడకంపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాట ు'మోటరు ఫ్రీ ట్యాప్' పేరిట స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు.

దాడులు చేస్తున్నా లెక్కలేదు !

కుత్బుల్లాపూర్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : 'మోటర్ ఫ్రీ ట్యాప్' కార్యక్రమం ద్వారా నల్లాపైప్‌లకు మోటర్లు బిగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు తాగునీటి వృథాను అరికట్టేందుకు కుత్బుల్లాపూర్ జలమండలి అధికారులు తమ పరిధిలో దాడులు నిర్వహిస్తున్నారు. అయినా లెక్క చేయకుండా బుధవారం కుత్బుల్లాపూర్ సర్కిల్ సుదర్శన్‌రెడ్డినగర్‌లో ఓ యువకుడు మోటర్ ద్వారా నల్లా నీటితో కారును కడుగుతూ కనిపించాడు. అసలే వేసవి కాలం కావడంతో నీటి ఎద్దడితో పలు ప్రాంతాల్లో జనం ఇబ్బంది పడుతుండగా, ఇలా యథేచ్ఛగా నల్లా నీటితో కారును కడుగుతూ నీటి వృథాకు పాల్పడుతున్న వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


నల్లా నీటితో కారును కడుగుతున్న యువకుడు


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా సెషన్స్ జడ్జి పంచాక్షరి

మధ్యవర్తిత్వంతో కేసుల సత్వర పరిష్కారం

● డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి పంచాక్షరి

జీడిమెట్ల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వం ద్వారా కోర్టుల్లో పేరుకుపోతున్న కేసుల సత్వర పరిష్కారానికి వీలవుతుందని డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి, తెలంగాణ రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ మెంబర్ సెక్రెటరీ సీహెచ్ పంచాక్షరి, సీనియర్ సివిల్ జడ్జి డి.కుమార్‌లు అన్నారు. సూరారంకాలనీలోని లూయిస్ బ్రెయిలీ కేంద్రంలో ఏర్పాటు చేసిన సర్వజన కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్‌ను బుధవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కుటుంబ కలహాలతో అనేక మంది కోరులను ఆశ్రయిస్తున్నారని, మన దేశంలో మధ్యవర్తిత్వం అనేది పురాతన కాలంనుంచి ఉందన్నారు. కేసులు కోర్టుల దాకా రాకుండానే మీడియేషన్ ద్వారా పరిష్కారం అవుతాయన్నారు. కేరళలో ప్రారంభమైన మీడియేషన్ సెంటర్లు, మధ్యప్రదేశ్ ఇతరరాష్ట్రాల్లోను ప్రారంభమై మంచి ఫలితాలను అందిస్తున్నాయన్నారు.ఈకేంద్రాలను ప్రజలు ఉపయోగించుకోవాలని సూచించారు. ఉచితంగా ఇక్కడ సేవలు అందిస్తారని, ఎలాంటి రుసుం చెల్లించాల్సిన అవసరంలేదన్నారు. కార్యక్రమంలో జి.అంజయ్యగౌడ్, ఎల్.మాణిక్‌రెడ్డి పాల్గొన్నారు.


శివప్రసాద్‌రెడ్డిని సత్కరిస్తున్న గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్స్ తదితరులు

సీఐఐ రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం

పేట్‌బషీరాబాద్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఇండస్ట్రీ (సీఐఐ) తెలంగాణ రాష్ట్ర శాఖ చైర్మన్‌గా ఎన్నికైన రాచమల్ల ఫోర్జింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఆర్. శివప్రసాద్ రెడ్డిని గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్స్, యాజమాన్యం సభ్యులు గాంధీనగర్ ప్రభుత్వ పాఠశాలలో సన్మానించారు. గాంధీనగర్ పాఠశాల అభివృద్ధికి శివప్రసాద్ రెడ్డి ఎంతో కృషి చేశారని, పాఠశాలల్లో పని చేస్తున్న విద్యా వలంటీర్లకు జీతాలు అందజేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు రామేశ్వర్ రెడ్డి, యూటీఎఫ్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు జయసింహారెడ్డి, గాంధీనగర్ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకట్ రాములు, ట్రస్మా కుత్బుల్లాపూర్ అధ్యక్షులు వినోద్ జాదవ్ పాల్గొన్నారు.


ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న శ్రీశైలంగౌడ్

ప్రజా ప్రభుత్వంతోనే పెద్దఎత్తున విదేశీపెట్టుబడులు: కూన

షాపూర్‌నగర్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ప్రజా ప్రభుత్వంలోనే విదేశీ పెట్టుబడులకు పెద్దపీట వేశారని మాజీ ఎమ్మెల్యే రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. బుధవారం షాపూర్‌నగర్‌లోని తన నివాసానికి వచ్చిన పలువురు నియోజకవర్గ ప్రజల నుంచి వివిధ సమస్యలపై వినతి పత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగాన్ని ప్రక్షాళన చేయడమే రాష్ట్ర ముఖ్యమంత్రి లక్ష్యమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబుల సారథ్యంలో మన రాష్ట్రానికి పెద్దఎత్తున పెట్టుబడులు రావడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు, మహిళాసంఘాల నాయకులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే వివేకానంద్‌కు వినతి పత్రం అందజేస్తున్న రజకసంఘం నాయకులు

ధోబీఘాట్‌లో బోరు వేయించండి

● ఎమ్మెల్యేకు రజకసేవా సంఘం సభ్యుల వినతి

షాపూర్‌నగర్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమానికి, వారికి జీవనభృతి కల్పించేందుకు సహకరించాలని మడేల ప్రజా రజకసేవా సంఘం సభ్యులు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను కోరారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సూరారం డివిజన్‌లోని రాజీవ్‌గాంధీనగర్‌లో రజకుల సంక్షేమానికి 2008లో ప్రభుత్వ ఎకరం స్థలం కేటాయించిందని, అక్కడి ధోబీఘాట్‌పై ఆధారపడి 80 కుటుంబాలు జీవిస్తున్నాయని సంఘం సభ్యులు తెలిపారు. ధోబీఘాట్ ప్రారంభానికి నోచుకోలేదన్నారు. కాగా, గతంలో ఎమ్మెల్యే సహకారంతో వేసిన బోరు ఎండిపోయి నీరు రాకపోవడంతో బుధవారం సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎమ్మెల్యేను కలిసి నూతన బోరు వేసేందుకు సహకరించాలని కోరారు. తమ విజ్ఞప్తికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సంఘం అధ్యక్షుడు ఎం.చంద్రం, ప్రధాన కార్యదర్శి మణి గొండ శంకర్, సాయిబాబా ఉన్నారు.


కొంపల్లిలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు, స్థానికులు

ఉగ్రవాదులను ఉరి తీయాలి: బీజేపీ

పేట్‌బషీరాబాద్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): కాశ్మీర్‌లోని పహల్గాం ప్రాంతంలో పర్యాటకులపై జరిగిన దాడికి నిరసనగా కొంపల్లి పురపాలక సంఘం పరిధిలో బీజేపీ నాయకులు, కాలనీలవాసులు కొవ్వొత్తులతో భారీ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, 26 మందిని పొట్టన పెట్టుకున్న ఉగ్రవాదులను పట్టుకొని కాల్చి చంపాలని లేదా ఉరి తీయాలని అప్పుడుగానీ ఇలాంటి ఘటనలు పునరావృతం కావని అన్నారు. కార్య క్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజిరెడ్డి, అసెంబ్లీ కో-కన్వీనర్ శివాజీరాజు, వినోద్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శివకుమార్, వినయ్, సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

నిజాంపేట్‌లో...

నిజాంపేట్,ఏప్రిల్23 (ఆంధ్రజ్యోతి): కాశ్మీర్‌లోని పహల్గాంలో హిందువులపై ఉగ్రదాడికి నిరసనగా నిజాంపేట్‌లో స్థానిక బీజేపీ అధ్యక్షుడు భిక్షపతియాదవ్ ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం నుంచి హనుమాన్ టెంపుల్ వరకు ర్యాలీ కొనసాగింది. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లి మాధవి, దాసిరాజు నాగరాజు, గజ్జల సంతోష్, రచ్చ చక్రధర్, రవియాదవ్, పద్మప్రసాద్ పాల్గొన్నారు.



క్యాండిల్ ర్యాలీలో పాల్గొన్న కొల్లి మాధవి తదితరులు

వేర్వేరు ప్రాంతాల్లో రెండిళ్లలో చోరీ

● మొత్తం రూ.22 లక్షల విలువైన బంగారం ఎత్తుకెళ్లిన దొంగలు

పేట్‌బషీరాబాద్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): రెండు వేర్వేరు ప్రాంతాల్లో దొంగలు ఇంటి తాళాలు పగులగొట్టి దాదాపు రూ.22 లక్షల విలువైన బంగారం అపహరించుకెళ్లిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. రెండు రోజుల తర్వాత ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వివరాలు పోలీసుల కథనం ప్రకారం.. జీడిమెట్ల డివిజన్ గాయత్రినగర్‌లోని ఎలిగెన్స్ క్యాస్టల్ అపార్టుమెంట్ నెం.401 ఫ్లాట్‌లో కేవీ రాజ్‌నారాయణ, జైలక్ష్మి దంపతులు ఉంటున్నారు. ఈ నెల 21న రోజూ మాదిరిగానే రాజ్‌నారాయణ కార్యాలయానికి వెళ్లగా, మధ్యా హ్నం సమయంలో జైలక్ష్మి తాళం వేసి తన కార్యాలయానికి వెళ్లింది. భార్యాభర్తలిద్దరూ ఆఫీసు నుంచి ఇంటికి వచ్చి చూడగా తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా బీరువా తాళాలు పగులగొట్టి అందులోని వస్తువులన్నీ బెడ్‌రూమ్‌లో చిందరవందరగా పడేసి ఉన్నాయి. బీరువాలో భద్రపర్చిన రూ. 20 లక్షల విలువైన బంగారం కనిపించలేదు.


బీరువా వద్ద ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు

మరో ఘటనలో..

దూలపల్లి ఎస్సీ కాలనీలో నివాసముంటున్న సత్యనారాయణ మంగళవారం ఉదయం ఉద్యోగానికి వెళ్లగా, మధ్యాహ్నం సమయంలో భార్య, పిల్లలు బంధువుల ఇంటికి వెళ్లారు. పైఅంతస్తులో నివాసం ఉంటున్న వారు కిందికి వచ్చి చూడగా సత్యనారాయణ ఇంటి తలుపు తీసి ఉన్నాయి. వెంటనే వారు సత్యనారాయణ కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వగా, వారు ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. బీరువా తెరిచి ఉంది. అందులో భద్రపర్చిన కిలో వెండి, నాలుగు గ్రాముల బంగారు ఉంగరం కనిపించలేదు. దీంతో బాధితులు తమ ఇళ్లలో చోరీ జరిగిందని పేట్‌బషీరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇన్‌ఫ్రా రంగంలోనూ హైదరాబాద్ ముందంజ

● సీఆర్‌ఆర్ఐ సంచాలకుడు ఆచార్య మనోరంజన్ పరిడా

నిజాంపేట్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి : రహదారుల వ్యవస్థలో భూకృతిమ పదార్థాల వినియోగంపై ఐదురోజు శిక్షణ కార్యక్రమం వీఎన్ఆర్‌వీజేఐఈటీలో బుధవారం ప్రారంభమైంది. కేంద రోడ్డు పరిశోధనా సంస్థ (సీఆర్‌ఆర్ఐ), భారత ప్రభుత్వ వస్త్ర మంత్రిత్వశాఖ జాతీయ సాంకేతిక, వస్త్రసాధన పథకం కింద వీఎన్ ఆర్‌వీజేఐఈటీ కళాశాలలోని సివిల్ ఇంజనీరింగ్ విభాగం ద్వారా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ప్రారంభ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఆర్‌ఆర్ఐ సంచాలకుడు, ఇండియన్ రోడ్డు కాంగ్రెస్ (ఐఆర్‌సీ)అధ్యక్షుడు ఆచార్య డాక్టర్ మనోరంజన్ పరిడా పాల్గొనగా, సీఆర్‌ఆర్ఐ సంస్థలోని సీఎస్ఐఆర్‌కు చెందిన వివిధ విభాగాల శాస్త్రవేత్తలు ఆచార్య డాక్టర్ పులికంటి సుబ్రహ్మణ్య ప్రసాద్, ఆచార్య డాక్టర్ కవితారవీందర్, డాక్టర్ గొట్టిముక్కల భరత్ తదితరులు విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆచార్య మనోరంజన్ మాట్లాడుతూ, ఐటీ రంగంలోనే కాకుండా ఇన్‌ఫ్రా రంగంలోను హైదరాబాద్ ముందంజలో ఉందని ప్రశంసించారు. రహదారుల పరిణామంలో భారత దేశం ప్రపంచంలో రెండవ స్థానంలో ఉండడానికి 73 ఏళ్లుగా, సీఆర్‌ఆర్ఐ 90 ఏళ్లుగా ఐఆర్‌సీ కృషి చేస్తున్నాయని వివరించారు. వీఎన్ఆర్‌వీజేఐఈటీ వంటి పేరెన్నిక గల విద్యా సంస్థతో సీఆర్‌ఆర్ఐ, ఐఆర్‌సీ కలిసి సాంకేతిక సదస్సు నిర్వహణ ఇంటర్న్ షిప్‌ల అవకాశాల వంటి భాగస్వామ్యానికి ఈ శిక్షణ కార్యక్రమం నాంది కానున్నదని ఆయన అన్నారు. శిక్షణ కార్యక్రమానికి తమ కళాశాలని ఎంపిక చేసినందుకు అతిథులకు కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య డాక్టర్ సీడీ నాయుడు కృతజ్ఞతలు తెలిపారు. సివిల్ ఇంజనీరింగ్ విభాగం డాక్టర్ ఎ.రమేష్, ప్రొఫెసర్ డాక్టర్ సీతారామాంజనేయులు, సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి రామోజీ, సీఎస్ఆర్‌కే ఇంజనీరింగ్ కళాశాల డీన్ ఆచార్య వంశీనాగరాజు తదితరులు పాల్గొన్నారు.


శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు